కథా నిలయం
1594
శ్రీకాకుళం

# నిన్న కురిసిన వర్షంనీరు

ఆకాశంనిండా కారుమేఘాలు ఆవరించుకున్నాయి. మేఘాల్లో మెరుపులున్నాయి. ఉరుములున్నాయి. కిటికీలోంచి చూస్తున్న కలికిమూర్తికి ఆకాశం వర్షిస్తున్నట్లుగా కనిపించడంలేదు అతని మెదడులో సమస్యల మేఘాలున్నాయి. పరిణామాల మెరుపులూ,ఉరుములూ లోపల్లోపల దాగున్నాయి. కంటికి నిద్రలేదు, మనసుకు శాంతిలేదు, ఆందోళన కంతులేదు.

శరన్నవరాత్రుల్లో ఆకాశం అందంగా ఉంటుంది. నిన్న అలాగేఉంది. ఇవాళ సాయంకాలానికి అనుకోకుండా అంబుదాలు ఆకాశాన్ని అలముకున్నాయి. ఉరుములూ, మెరుపులూ ఉధృతమైపోయాయి.

౪

విశాలమైన ఆకాశం మేఘాలతో చిన్నదైపోయి నట్టుగా ఉంది. గాలి ప్రారంభమైనప్పుడు చలి ఒళ్ళు విరుచుకుంది.

సాయంకాలం ఆఫీసునుంచి బయటపడిన తరువాత కరుణతో తనన్నాడు- "కాస్సేపు ఎక్కడైనా కూచుందామా!" అని.

కరుణ తలూపింది.

ఆశ్వయుజం ప్రారంభం గనుక ఆఫీసు విడిచేవేళకే నీరెండలు భూమ్మీద పాకుతున్నాయి. అప్పుడు గాలి ఆహ్లాదం కలిగిస్తోంది. అందుకని టాంక్ బండ్ మీద ఒక సిమెంటు బెంచీ కొంచెం దూరంగా దొరికింది. వేరుశనగ పప్పుతింటూ కలికిమూర్తి ఆమె కళ్ళల్లోకి చూశాడు. చూస్తూ అన్నాడు. "ఎన్నాళ్ళనించో దాస్తున్నావు. నాకొంచెం భయంగా ఉంది. ఇంకాదాస్తే ప్రయోజనం ఏం వుంది! ఈవేళ తాడోపేడో తెగేసి చెప్పు."

కలికిమూర్తి "ఎక్కడైనా కూచుందామా!" అని అడిగినప్పుడు కరుణ యిటువంటి సన్నివేశాన్ని సంభాషణలతోసహా ఊహించుకుంది. అయినా ఆమె భయపడవలసిన పనిలేదు. ఇన్నాళ్ళూ—ఏదో ఒకరోజున చెప్పకతప్పదనుకుంటూనే ఉంది. ఆరోజివాళ వచ్చింది.

కరుణ ఒకసారి కళ్ళుమూసుకుంది. దూరంగా ఎర్రదనం విరిగిపోతున్న హుసేన్ సాగర్ నీళ్ళను చూసింది. అటువేపునుంచి వొస్తూ పోతున్న జనాన్ని చూసింది. ఒకసారి కలికిమూర్తినికూడా చూసీచూడనట్టు చూసింది. ఆ తరువాత మళ్ళీ ఓసారి కళ్ళుమూసుకుంది. ఆమె ఎంతో ఆలోచనలో మునిగిఉందనుకున్నాడు కలికిమూర్తి. కథ ఎటునుంచి ప్రారంభించాలో తెలీక ఆమె తటపటాయిస్తోందని కూడా అతననుకున్నాడు.

కరుణ పెదవులు తడిచేసుకుని "తీరా నా కథంతా చెప్పింతర్వాత నామీద మీకుండే సదభిప్రాయం ఏమైపోతుందో అని నాకు భయంగా ఉంది. అయినా ఈవేళ చెప్పక తప్పదు" అంది.

కలికిమూర్తి ఆమెవంక కొంచెం అనుమానంగా చూస్తూ–"నీకాభయం ఏమాత్రం అక్కరలేదు. ఎన్ని కట్టుకథలు చెప్పినా నువ్వు నానించి దూరంగా వెళ్ళలేవు. నువ్వూ నేనూ భావిలో ఎంతోదూరం జంటగా వెళ్ళాలి. నువ్వెందుకు ఒక నిర్ణయానికి రావడానికి సందేహిస్తున్నావో మాత్రం నాకర్థం కావడంలేదు. అందుకే ఆ కథేమిటో చెప్పమంటున్నాను" అన్నాడు.

ఎప్పుడు ప్రారంభమైందోగాని వర్షం గట్టిగా పడుతోంది. కలికిమూర్తి కుర్చీలోంచి లేచి కిటికీ ఊచలు

పట్టుకునిలబడి దూరంగా చూశాడు. ఏమీ కనిపించలేదు ఒట్టి చీకటితప్ప. ఏమీ వినిపించడం లేదు—గాలి హోరు తప్ప.

గుండెల్లో గూడుకట్టుకున్న ఆవేదనను అణచుకోలేక ఆకాశం పెద్దపెట్టున ఉరుములూ, మెరుపులతో ముక్కుతూ మూలుగుతూ ఏడుస్తున్నట్లుగా ఉంది.

చీకట్లో-కురుస్తున్న వర్షంలోకిచూస్తూ కలికిమూర్తి కరుణగురించే ఆలోచిస్తున్నాడు.

కరుణ కుందనపుబొమ్మలా ఉంటుంది. ఆమె కళ్ళు చాలా అందమైనవి. టైపిస్టుగా ఆమె జాయినింగ్ రిపోర్టిచ్చిన రోజునే కలికిమూర్తికి ఆమెతో పరిచయమైంది. అతను కరుణ కంఠస్వరానికి తన్మయుడై పోయాడు. ఆమెతో మాట్లాడ్డం కోసమే అతను తపించిపోయాడు. వాళ్ళ పరిచయం వృద్ధి అవుతున్నకొద్దీ అందుకు కలికిమూర్తిలో గర్వం పెరిగింది.

వాళ్ళిద్దరూ అతి సన్నిహితంగా మెలగడం డిపార్టుమెంటంతకూ తెలుసు. సినిమాథియేటర్లలో, రెస్టారెంట్లలో పబ్లిక్ పార్కుల్లో వాళ్ళిద్దరూ జంటగా కనిపించడంచూచి మొదట్లో అందరూ గుసగుస లాడుకునేవారు. ఇద్దరుముగ్గురు

కలికిమూర్తి దగ్గర కరుణసంగతి ప్రస్తావించినప్పుడు అతనొక చిరునవ్వునవ్వి ఊరుకునేవాడు. ఆ సాన్నిహిత్యం క్రమంగా పెద్దదై వివాహాంతరకూ వచ్చి ఆగిపోయింది.

పెళ్ళి అనగానే కరుణ మౌనం దాల్చింది. కలికి మూర్తి అసలు సంగతేమిటో చెప్పమన్నాడు. "నేనసలు ఎవరినీ పెళ్ళిచేసుకోదలచుకోలేదు" అని చెప్పేసింది.

"అదే-అదే చెప్పమంటున్నాను. నువ్వెందుకు చేసుకోదలచుకోలేదు? అందుక్కారణం చెప్పమనే అడుగుతున్నాను" అని నిలదీసి అడిగాడతను. కరుణ కారణం చెప్పడానికి ఇంతకాలం వాయిదా వేస్తూ వొచ్చింది.

హోరున కురుస్తున్న వర్షంలోకి చూస్తున్నంతసేపూ ఆ సాయంకాలం కరుణ చెప్పినకథ జ్ఞాపకం వస్తోంది.

ఆమె ఏం చెప్పింది?

"మీరు నమ్మరుగాని బి బి సెక్షన్‌లో పులకేశి వన్నో శలవురోజున సినిమాకి రమ్మని పిలిచాడు. మంచి వాడని నమ్మి వెళ్ళాను. న్యూస్‌రీల్ అయినతరవాత అతను నాక్కొంచెం దగ్గరగా జరిగాడు. నేను అలాగే కూర్చున్నాను. మరికాసేపటికి తను నా భుజంమీద మెత్తగా చేయివేశాడు. మౌనంగా నేను అతని చేతిని తప్పించాను.

అయినా రెండోసారి భుజంమీాంచి చేతిని గట్టిగా నొక్కాడు. ఇంక సహించలేక అది మంచిపని కాదని చెప్పాను. నన్ను పెళ్ళిచేసుకుంటానన్నాడు. సినిమా అయిపోయిన తరువాత ఆ సంగతి మాట్లాడొచ్చునన్నాను. పారడైజ్ నించి పబ్లిగార్డెన్ వరకూ నడుచుకుంటూవచ్చాము. అక్కడ బయట అప్పటికీ తళుక్కు మంటున్న నక్షత్రాల వెలుగులో కూచున్నాము. అప్పుడు చెప్పాను నేను చేసిన పాపమంతా. అప్పుడడిగాను "నన్ను పెళ్ళి చేసుకుంటారా!" అని పాపం పులకేశి మళ్ళీ మాట్లాడలేదు. "సారీ మీరిటు వంటి వారనుకోలేదు. లేకపోతే తప్పకుండా పెళ్ళిచేసుకునే వాడినే" అన్నాడు. తీరా నా కథ విన్న తరువాత మీరూ అలాగే అంటారని నాకు తెలుసు. అందుకు నాకు భయం లేదు. మీకు నిజం తెలియడం చాలా మంచిది."

కరుణ పులకేశి సంగతి చెబుతున్నప్పుడు అంతకు రెండురోజులముందు కో-పరేటివ్ క్యాంటిన్‌లో హల్వా పెసరట్, ఉప్మా కాఫీ అయిన తరువాత బుగ్గనుబిగించుకున్న మిఠాపాన్ క్రమంగా కరిగిపోతున్నప్పుడు చల్లని చెట్టు నీడలో చలపతి చెప్పినదంతా నిజమే ననిపించింది.

చలపతికి కరుణమీద చెప్పలేనంత యిష్టం ఏర్పడింది. ఒకటికి రెండుసార్లు సంగతి ఆతను కలికిమూత్రితో నవిన

యంగా చెప్పుకున్నాడు, కలికమూర్తి అతను చెప్పినదంతా విని చాలా జాలిపడ్డాడు. "పాపం అమాయకుడు" అనికూడా అనుకున్నాడు. ఎందుకంటే, కరుణతో కలికిమూర్తికి అప్పటికే సరిపడా సన్నిహితం ఏర్పడిపోయింది.

"నా ఇరవై అయిదేళ్ళ లైఫ్‌లోను అంత అందాన్ని అంత సొగసుని ఇంత చమత్కారాన్ని ఎరగను. నిజంగా కలికీ! నేను పెళ్ళిచేసుకో దల్చుకున్న నా స్వప్నసుందరి అచ్చంగా ఇంతే. కరుణఅభిప్రాయం అడిగితే తేల్చేసుకుంటాను. కలికీ నువ్వు మా పెళ్ళికి తప్పక రావాలోయ్. మరిచిపోయ్యేవు గనుక! అందుకే యిప్పుడే చెబుతున్నాను"

ఈ ధోరణి యిలా కొన్నాళ్ళు సాగినా బావుండేది. ఆ రోజు హల్వా తింటున్నప్పుడు చలపతిముఖం చాలా విచారంగా కనిపిస్తే "సంగతేమిటోయ్" అని అడిగాడు కలికిమూర్తి.

"చెబుతా? నీకు చెప్పకపోతే మరెవ్వరికి చెబుతాను. ముందు పెసరట్ కానీ లాన్‌లో కూచున్నాక చెబుతా!" అన్నాడు చలపతి.

చలపతి చెప్పినదంతా విని కలికిమూర్తి చిరునవ్వు నవ్వాడు. అతనెందుకంత అందంగా నవ్వాడో చలపతికి తెలీలేదు పాపం! నిజంగానే చలపతి విచారంలో ఉన్నాడు.

కలికిమూర్తి మాత్రం మరో విధంగా ఊహించుకున్నాడు. కరుణకూ తనకూ ఏర్పడ్డసాన్నిహిత్యానికి కన్నుకుట్టి చలపతి ఈ విధంగా కట్టుకథ కల్పించాడని అనుకుని చిరునవ్వు నవ్వాడు అందుకే ఆ విషయానికంత ప్రాముఖ్యత యివ్వలేకపోయాడు,

కాని- పులకేశికి తనే విధంగా చెప్పిందో కరుణ తెలియజేసినప్పుడు మాత్రమే చలపతి చెప్పింది యధార్థమని అనుకున్నాడు కలికిమూర్తి.

కరుణ కన్నెపిల్ల మాదిరి కనిపిస్తుంది గాని అప్పటికప్పుడే ఆమెకోసారి పెళ్ళయింది. మగడు మాత్రం మరణించాట్ట! అంత మాత్రం చెప్పి కథ ముగిస్తే ఎంతో బావుణ్ను. కథకొక ఉపకథ కూడా జత వుంది. మానవ సహజమైన కోర్కెలతో కరుణ ఆ తరువాత అతగాడెవరితోనో హైదరాబాదు పారిపోయి వచ్చేసిందనీ కొన్నాళ్ళ పాటు ఆమెను తీసుకొచ్చిన మొనగాడుహాయిగా ఆమెతో కాలం గడిపి ఎక్కడికో మాయమైపోయాడని కరుణ చెప్పింది,

"కలికమూర్తిగారూ, మీకు నిజం చెబుతున్నాను నాకు ప్రేమంటే ఏమిటో తెలీదు. మానవ సహజమైన మామూలు కోర్కెలకు లొంగిపోయిన మనిషిని నేను. చేసిన

పాపానికి యిప్పుడు పశ్చాత్తాప పడినందువల్ల ప్రయోజనం లేదని తెలుసు నాకు. అంచేతనే ఏవిధమైనవిచారం లేకుండా బతుకుతున్నాను.

చేసిన పాపం చాలు. మళ్ళీ తప్పు చేయను. ఇక వెళ్ళన్నారా! నా మీద జాలిపడి పెళ్ళి చేసుకుంటానంటే మాత్రం ఎప్పటికీ నేను పెళ్ళిచేసుకోను. నిజం తెలుసుకుని నా నిజాయితీని మెచ్చుకుని ఆనందంగా భవిష్యత్తుగడవనిచ్చే మగవాడు దొరికినప్పుడు నేను తప్పక పెళ్ళి చేసుకుంటాను."

అప్పటికే కలికిమూర్తి మనసు అస్తవ్యస్తమై పోయింది. మూగ బొమ్మలా కూచున్నాడు. అసలెటు ఆలోచించడానికి అతనిమెదడు అంగీకరించడంలేదు. బయట పెద్ద వర్షం కురుస్తున్నప్పుడు గదిలో ఒంటరిగా కూచున్నట్టుగా వుంది.

"మీరు నన్ను పెళ్ళి చేసుకుంటానని చెప్పినప్పుడు నేను సంతోషించలేదు. ఇప్పుడు "సారీ" అన్నా నేను విచారించను. అయినా నిజాన్ని దాచుకోవడం వల్ల ప్రయోజనం ఉండదన్న ఉద్దేశంతోనే యిదంతా చెప్పవలసి వచ్చింది. మిమ్మల్ని మోసగించి పెళ్ళి చేసుకుంటే ఆ తరువాత ఫలితం వేరొక విధంగా ఉండవచ్చు..."

కలికిమూర్తి లేచి నిలబడ్డాడు. కుడిచేత్తో నుదురు రాసుకున్నాడు.

"వస్తాను కరుణా, నా మనసు చాలా గందరగోళంగా వుంది. రేపు ఆఫీసులో కలుసుకుంటాంగా గుడ్ నైట్!"

రాత్రంతా వర్షం కురుస్తూనే వుంది. పరిష్కార మార్గం కలికిమూర్తికి కనిపించలేదు.

ఒక స్త్రీని కన్యగా భావించి ఆమెకు తను మనసిచ్చాడు, ఇద్దరూ సన్నిహితులయ్యారు. చాలా కాలం కలిసి తిరిగారు. కాని ఈవేళ కరుణ తను పెళ్ళికాని పిల్లను కానని పతితననీ చెప్పేసింది. కొన్నాళ్ళు భర్తతో కాపరం చేసి మొగుడు చచ్చిపోతే ముద్దుముచ్చటకోసం లోలోపల చెలరేగే కోర్కెల దావానలాన్ని చల్లార్చుకోవడం కోసం ఎవడితోనో పారిపోయి వొచ్చేసి వాడిచేత మోసగింపబడి అందుకు కనీసం పశ్చాత్తాపపడకుండా బతుకుతున్న ఒక అందమైన స్త్రీని పెళ్ళిచేసుకుంటేపరిణామం ఎలా వుంటుంది. ఒక పతిత చేసిన పాపానికి పశ్చాత్తాపం పొందినందువల్ల ప్రయోజనం లేదని నిర్భయంగా చెప్పగల ఆడది మగాడితో కాపురం చేస్తుందా?

"ఛీ" కరుణకు అసలు సిగ్గయినా లేకపోయిందే: లేకపోతే—చేసినతప్పు ఎలా చెప్పగలిగింది! అనుకున్నాడతను.

పులకేశికి, చేశరికీ, తనకూ, అందరికీ ఒకే పెద్ద ప్రశ్న. అది బండరాయి "నేను పతితను బాగా చెడిపోయిన దాన్ని నన్ను మీరు పెళ్ళిచేసుకోగలరా?" అని కరుణ నిర్భయంగా ప్రశ్నిస్తోంది.

అతనికెప్పుడు నిద్రపట్టిందో తెలీదు. నిద్రలో కూడా వర్షం చప్పుడు వినిపిస్తోంది ఆగి ఆగి కురుస్తున్న వర్షం, పక్కింట్లో ముసలాడి దగ్గూ—అన్నిటినీ మించి విపరీతమైన చలి సరిగా నిద్రపట్టని అతన్ని సతాయిస్తున్నాయి.

చెడిపోయిన స్త్రీని పెళ్ళి చేసుకుంటే ఏమౌతుంది? పోనీ—మొండికెత్తి పెళ్ళిచేసుకున్నా - ఆమెతో సుఖమయ సంసారం సాగుతుందా? సాగకపోతే అప్పుడు తన గతేమిటి? నిద్రపట్టీ పట్టని స్థితిలో అతనేమి నిర్ణయించుకోలేకపోయాడు.

ఉదయానికి ఆకాశంలో యింకా మబ్బులున్నాయి. వర్షం మాత్రం లేదు దూరంగా తాటిచెట్టు వెనక సూర్యబింబం అస్పష్టంగా కన్పించింది. నిన్న కురిసిన వర్షం నీరంతా భూమిలో యింకిపోయిందో - పల్లానికే జారి ఎటో పారిపోయిందో తెలీదు.

కలికిమూర్తికి మనస్సు కొంచెం తేలిగ్గా ఉన్నట్టనిపించింది. నిన్నరాత్రి ఆకాశంలో వర్షిస్తున్నప్పుడు తన మనసులోనూ విచారం వర్షించింది ఇవేళ మాత్రం తేలిక

పడ్డ నీలాకాశం మాదిరి అతని మనస్సు అతినిర్మలంగా ఉంది. ఆలోచించి ఒక నిర్ణయానికి రాగల స్తిమితం చిక్కింది.

కరుణ అంటే అతనికెప్పుడు మంచి అభిప్రాయం వుంది. ఆమెతో తన అనుభవాలు ఎటువంటి లోపాన్నీ ఆమెలో చూపించలేదు. అయినా తాను పతితనని ఏ స్త్రీ యైన చెప్పినపుడు - ఆమెమీద అంతవరకూ ఏర్పడ్డ సదభిప్రాయం చట్టు బండలుకాక తప్పదు.

పతితను తను వివాహం చేసుకోడానికి ఉవ్విళ్ళూరడంలేదు. ఈ నిర్ణయాన్ని ఆమె విన్నప్పుడు ఏ విధంగానూ రియాక్టు కాకపోవచ్చు. కరుణ స్వయంగా ఈ విషయాన్ని స్పష్టం చేసింది కూడాను.

తనకు అమ్మ ఉంది. నాన్న ఉన్నాడు. పెళ్ళికావలసిన చెల్లెళ్ళున్నారు. పెళ్ళివిషయంలో తన నిర్ణయాన్ని వాళ్ళెవరూ కాదనరు. అయినా తను స్వతంత్రించి ఒక నిర్ణయం చేసినందువల్ల తన వారి భవిష్యత్తుకు దెబ్బతగలకూడదు. ఒక చెడిపోయిన స్త్రీని తను అభ్యుదయ భావాల పేరుతో అనురాగం నీడలో పెళ్ళిచేసుకుంటే అందువల్ల కొందరి జీవితాలు తల్లక్రిందులైనా కాకపోయినా ఆ ఆలోచనలతో తను కొంత మానసికంగా బాధ పొందక తప్పదు. అంతే కాదు - కరుణ చెడిపోయిన స్త్రీ అన్న భావన తను దాంప

త్యాన్ని ఎప్పటికైనా దెబ్బతీస్తుందేమోనన్న అనుమానం కూడా అతనిలో తలఎత్తింది.

అనేక విధాలైన ఆలోచనలతో కలికియూర్తి ఏ నిర్ణయం చేసుకోలేకపోయాను.

ఆఫీస్ ఎంట్రెన్స్ గేట్ దగ్గరే కరుణ నవ్వుతూ కన్పించింది. కాని - అతను మాత్రం ఎప్పటి మాదిరి నవ్వ లేకపోయాడు. కరుణ ఈ మార్పును పసిగట్టలేకపోలేదు. ఆమె మామూలుగా ఎలా చిరునవ్వు నవ్వగలిగిందోనని కలికిమూర్తికి ఆశ్చర్యం కలిగింది. ఎంతో సన్నిహితమైన ఆమె కొన్ని గంటల కాలంలోనే దూరమైపోయినట్టుగా అనిపించింది.

లంచ్ అవర్ లో విజయసారథి ఒక వింత వార్తను మోసుకువచ్చాడు. సరాసరి అతను కలికిమూర్తి దగ్గరకు వచ్చి-"కరుణ పెళ్ళిట, విన్నావా!" అనడిగాడు. కలికిమూర్తి నిలువు గుడ్లేసి చూశాడు.

"మా సెక్షన్ అసిస్టెంటు రమాదేవికి చెప్పిందిట: త్వరలోనే ముహూర్తం పెట్టుకుంటారట!"

కలికిమూర్తికీసారి విజయసారథి మీద చాలా కోపం వొచ్చింది.

"అసలీ సంగతి ప్రత్యేకంగా పనిగట్టుకొచ్చి నాకు చెప్పవలసిన అవసరం ఏం ఒచ్చింది?" అని అడిగాడతను.

పాపం! విజయసారథి ఎదురుగాలికి తట్టుకోలేక సతమతమైపోయాడు.

"సారీ బ్రదర్! అంతకోపం ఒస్తుందంటే నీకు చెప్పకనే పోదును. మొన్నటివరకూ అంతా కరుణకూ నీకూ పెళ్ళని చెప్పుకున్నారు. ఇప్పుడు ఇలా అని చెప్పుకుంటుంటే అసలు నిజమేమిటో తెలుసుకుందామని అడిగా" అని మెల్లగా జారుకున్నాడు.

సరిగ్గా అదే సమయంలో కరుణ ఏదో పనిమీద కలికిమూర్తి దగ్గరకు వచ్చింది.

"చూడండి కలికిమూర్తిగారూ! లాస్టుఇయర్ ఆడిట్ అబ్జక్షన్‌తో ఎ. జి. రిఫరెన్సు ఒకటి ఎ. యస్ మీ సెక్షన్‌కు మార్కు చేశారట. ఆ డిఓ ఓసారి పట్రమ్మన్నారు" అని చెప్పింది కరుణ.

"మీ పెళ్ళిటకదూ!" అని అడిగాడు కలికిమూర్తి.

"అవునట - అలా అనే అంతా చెప్పుకుంటున్నారు. రమాదేవి కూడా ఇదే ప్రశ్న అడిగింది. అవునన్నాను. పెళ్ళికొడుకెవరని అడిగింది. రేపొద్దుట చెబుతానన్నాను. నా పెళ్ళి సంగతి కేవిటిగాని ముందా డి.. ఓ పట్రండి-డి. ఎస్. ఫోన్ చేశార్ట..." అని చెప్పి ఆమె అతి జరూరుగా వెళ్ళిపోయింది.

అప్పుడు కలికిమూర్తి మెదడులో ఒక కొత్త ఆలోచన వచ్చింది. ఆ ఆలోచన అతని మనసును తేలికపరచింది. అంతవరకూ కారు మేఘాలతో కిక్కిరిసిన ఆకాశవీధి పెనుగాలికి నిర్మలమై పోయినట్టయింది. రెండు గంటల జడివాన పిదప రోడ్డు ప్రక్క సన్నగా వాననీరు ప్రవహించి పోతున్నట్టనిపించింది. అకౌంటెంట్ జనరల్ నించి వచ్చిన డెమీ అఫీషియల్ లెటర్‌ని అసిస్టెంటు సెక్రటరీ వారికి అప్పగించి కలికిమూర్తి కుర్చీలో కాళ్ళు బార జాపుకుని ఒక గంట ప్రశాంతంగా నిద్రపోయాడు.

ఆ సాయంకాలం మళ్ళీ ఆకాశం అందంగా ఉంది. గాలి చల్లగా ఉంది. నిర్మలమైన హుసేన్‌సాగర్ నీటి కెరటాలు నీరెండలో ఎంతో బావున్నాయి.

"నువ్వు చెప్పిందంతా అబద్ధం కదూ!" అని అడిగాడు కలికిమూర్తి.

"ఏ విషయం?" అని అడిగిందామె.

"కాబోయే నీ పెళ్ళి సంగతి కాదు..."

"మరేమిటి?"

"అయిపోయిన నీ పెళ్ళి సంగతి"

ఆమె సమాధానం చెప్పలేదు.

"ఒక్క ప్రశ్న అడుగుతాను సూటిగా చెబుతావా?" కలికిమూర్తి అడిగాడు.

ఆమె తలూపింది.

"ఇంతకాలం కలసి తిరిగావు. నన్ను నీవు అర్థం చేసుకోలేకపోయావు. అందరిమాదిరిగా నన్నూ పరీక్షించాలని అనుకున్నావు. పులకేశిని, చలపతిని, నన్నూ ఒకే విధంగా ఎలా అనుకున్నావో ఆశ్చర్యంగా ఉంది కరుణా! నీకసలు హృదయం ఉందా?"

"ఉంది" అంది కరుణ.

"లేదు" అన్నాడు అతను. అని వూరుకోలేదు.

"తప్పు చేయనిదానివి తప్పు చేశానని అబద్ధం ఎందుకు చెప్పావ్? పెళ్ళి అయిందని ఎవరితోనో లేచి వచ్చేశానని కథ అల్లి నన్ను పరీక్షించడంలో నీ ఉద్దేశం ఏమిటి? నిన్న నువ్వీ కట్టుకథ చెప్పినప్పటి నుంచి నా మెదడులో వెయ్యి అగ్నిపర్వతాలు రగులుతున్నాయి. ఈ విషయం విన్న తరువాత చచ్చిపోదామనుకున్నాను. లేకపోతే_కరుణా! ఇదంతా ఏమిటి చెప్పు!"

అతనే మళ్ళీ అన్నాడు...

"తప్పుచేయనివాళ్ళు ధైర్యంగా ఉండగలరని నాకు తెలుసు. అయినా కట్టుకథ చెప్పడానికైనా కొంచెం సిగ్గుండాలి. చేయని తప్పును నెత్తిమీద వేసుకోడానికైనా నీకు సిగ్గులేకపోయిందా"

కరుణ చాలాసేపు ఏమీమాట్లాడకుండా కూచుంది. చీకటి అలుముకొంటుంది! లైట్లింకా వెలగలేదు. చటుక్కున కరుణ అతనిచేతిని ముద్దుపెట్టుకుంది.

"రేపొద్దుట రమాదేవితో చెబుతాను. మా పెళ్ళి తొందరలోనే జరుగుతుందని" అని చెప్పి నవ్వేసింది కరుణ.

"గొప్పపని చేసావులే. ముందు నా ప్రశ్నకు సమాధానం చెప్పు, ఇలా నన్నెందుకు పరీక్షించావ్. చెబితేగాని నిన్ను వదలను" అన్నాడు అతను.

"చెప్పమంటారా?" అని అడిగింది కరుణ.

"నువ్వు నన్నెందుకు పరీక్ష చేయాలనుకున్నావో వింటేగాని నాకు అన్నం సయించదు నిజం చెప్పు" అని అడిగాడతను.

కరుణచేతిలో అతనిచేయింకా ఉంది. కరుణ కను పాపల్లో అతని బొమ్మున్నది. ఆమెహృదయంలో అతనిప్పుడు

స్థిరంగా నిలబడున్నాడు. ఆమె చేసిన అగ్నిపరీక్షలో అతగాడు విజయం పొందాడు. అందుకే ఆమెకి గర్వం. ఆ గర్వం సర్వం ఆమె కళ్ళల్లో తళుక్కుమంటోంది.

ఆమె చెప్పింది—

"నా పెళ్ళి చేయాలని మానాన్న బతికుండగా విశ్వప్రయత్నం చేశాడు. పెళ్ళికొడుకులు చాలామంది మా యింటి గడప తొక్కారు. అందరూ దాదాపు బాగా చదువుకున్నవాళ్ళు. అందరూ నవనాగరికత మాటున బతుకుతున్నవాళ్ళు. వాళ్ళంతా సంస్కృతి, సంప్రదాయం సంగతి బాగా తెలిసున్నవాళ్ళు. అయినా అందరికీ చదువుకున్న పిల్లలంటే అనుమానం. చదువుకున్న ఆడపిల్ల పవిత్రత యెడల నిజమైన నమ్మకం వాళ్ళకిలేదు. ఒక స్త్రీ యెడల మగాడి కుండదగ్గ అభిమానం వాళ్ళలో నాక్కన్పించలేదు. అంతేకాదు—ఒక స్త్రీని పెళ్ళి చేసుకోవడానికి పదివేలూ, పదిహేనువేలూ ఎందుకు కావల్సి వస్తుందో నాకర్థంకాదు. కట్నం లేకుండా పెళ్ళి చేసుకోడానికి అంగీకరించిన ఒక పెళ్ళికొడుకు నా గురించి మా ఊళ్ళో ఆచూకీ తీయడానికి ప్రయత్నించాడు. "నీకు ప్రేమలేఖ వ్రాయడం

వచ్చా" అని అతగాడు నన్నడిగాడు. ఈ పెళ్ళి కొడుకులతో నా మనసు విసిగెత్తిపోయింది. కన్నుమూసేటప్పుడు కూడా మా నాన్న నాకు పెళ్ళికాలేదని బెంగటిల్లాడు. అందుకే నా మనసు ఇలా మారిపోయింది. పులకేశి నా పరీక్షలో ఓడిపోయాడు. చలపతి చేతులెత్తేశాడు మళ్ళీ నా వంక కన్నెత్తయినా చూడలేదు. వాళ్ళు తప్పుచేశారని నేననను. మానవసహజమైన బలహీనతలు వాళ్ళకున్నాయి. కాని-అటువంటి బలహీనతలుగల ఏ మనిషినైనా నేనెట్లా చేసుకోను. మీ సంగతి కూడా చూద్దామని అదే కథ మీకు చెప్పాను. మీరుమాత్రం నన్ను ఓడించేశారు"

ఇంతసేపూ కలికిమూర్తి నోరు విప్పలేదు.

ఇప్పుడతని చేతిలో ఆమెచేయి బిగుసుకుంది.

ఆమె యెడల అభిమానంతో అతనిచేయి వేడిగా ఉంది.

నిన్నకురిసిన వర్షంనీరు ఖాడీబందాతో హుసేన్ సాగర్లో కలిసినా అదివాళ అట్టడుగుకు చేరిపోయినట్టుంది.

నీరు నిర్మలంగా ఉంది, గాలి హాయిగాఉంది. నెత్తి మీద ఆకాశం నిన్నటి మేఘాల్ని కడుక్కొని నున్నని

గచ్చులా ఉంది. గచ్చుమీద అతికిన ముత్యాల్లా నక్షత్రాలు మెరుస్తున్నాయి.

(ఆంధ్రజ్యోతి 10-7-70)